# మోదకొండమ్మ తుమ్మెదపదం



## పాడేరులో మోదమాంబ అమ్మవారు

శరణు శరణు దుర్గాలమ్మలు - మీచరణాలు తప్పరేము
మీ చరణాలు తప్పినకాని - మీకరుణాలు తప్పరేము
మీలాటి కాలమురాగ - మిమ్ముతలచి పాడుతాము



దారకొండలో దారాలమ్మతల్లి



శాంబరికొండలలో బోడకొండమ్మతల్లి



లోతుగడ్డ వీరభద్రస్వామి గుడిముందు శివలింగం





లమ్మసింగిలో పంచపాండవులు

పాతపాడేరు శివాలయం

గోడమీది బొమ్మలు



# మోదకొండమ్మతుమ్మెదపదం



**పాడేరులో మోదమాంబ అమ్మవారు**

శరణు శరణు దుర్గాలమ్మలు - మీచరణాలు తప్పరేము
మీ చరణాలు తప్పినకాని - మీకరుణాలు తప్పరేము
మీలాటి కాలమురాగ - మిమ్ముతలచి పాడుతాము

ప్రతులు : 1000

ప్రథమముద్రణ :

2007

ముద్రణ :

ప్రతులకు : **శక్తి**

305, జనప్రియఅబోడ్స్,

గాంధీనగర్, హైదరాబాదు–500 080.

ఫోన్: 040–66614787, 66627893

email: saktisrk@yahoo.com

website: www.sakti.in

ఇతర ప్రచురణలు : కొండకోనల్లో తెలుగు గిరిజనులు

ప్రచురణ చందా : రూ.25/–

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | మోదకొండమ్మ తుమ్మెదపదం, చారిత్రకనేపథ్యం | 1 |
| 2. | కొత్తపల్లి ముర్వలమ్మ | 3 |
| 3. | కొండరాజుల - దిగువరాజుల చుట్టరికాలు | 4 |
| 4. | మోదమ్మ పదం: మీలాటి కాలమురాగ - మిమ్ముతలచి పాడుతాము | 5 |
| 5. | దేశిరాజులు - దుర్గాండ్లు | 6 |
| 6. | దుర్గాండ్లు | 8 |
| 7. | దేశిరాజులు, దుర్గాండ్లు, కొత్తపల్లి ముర్వలమ్మ | 9 |
| 8. | దొంగ పెండ్లిండ్లు | 10 |
| 9. | ఏడుగడియల శిక్ష - ఆత్మహత్యలు | 12 |
| 10. | తీర్థయాత్రలు - వెంకటేశుని దుర్మరణం | 13 |
| 11. | సంజీవరాజు పుట్టుక | 15 |
| 12. | మేళాలకు కదిలే గంగుగారు | 15 |
| 13. | వేటలకు కదిలిన సంజీవరాజు | 16 |
| 14. | పూలగండువనంలో గంగుగారి ఆలపాటలు | 17 |
| 15. | కావళ్ళు మోస్తున్న సంజీవరాజు | 19 |
| 16. | మాలగంగువద్దకు మాకలిశక్తి | 21 |
| 17. | పెళ్ళిఏర్పాట్లు | 23 |
| 18. | గంగు - సంజీవరాజుల కల్యాణం | 24 |
| 19. | మోదకొండమ్మపదంలో ప్రదేశాలు | 27 |
| 20. | దొంగపెండ్లి - గౌరవంగపెండ్లి | 28 |
| 21. | తప్పు - వెలి; సంకెళ్ళు - కారాగారశిక్ష | 28 |
| 22. | ఉంచుకోవడం, వెలివేయడం, పెండ్లిచేయడం | 28 |

23. పల్లాన పదివేలమాయలు 29

24. కొండవారి-దిగువవారి దృక్పథాలు 29

25. ఆధారగ్రంథాలు 30

26. విశాఖజిల్లా గ్రామసాంస్కృతిక పటం 32

27. వ్యవస్థలు, వర్ణవివక్ష, విశాఖమన్యంలో రాజ్యాలు 33

28. 12వ శతాబ్ది రాజకీయ పటం 34

29. రంపగూడెం (1880) 35

30. కనిపెట్టండి 36

❁ బొమ్మలు - సుగుణశ్రీ

❁ ఫోటోలు ఆర్క్ స్వచ్ఛందసంస్థ పాడేరువారు తీసినవి

❁ *మోదమ్మ తుమ్మెదపదం 'కొండకోనల్లో తెలుగు గిరిజనులు' నుండి.*

మాతా మరకతశ్యామా మాతంగీ మధుశాలినీ
కుర్యాత్ కటాక్షం కల్యాణి! కదంబవనవాసినీ

జయ మాతంగ తనయే - జయ నీలోత్పలద్యుతే
జయ సంగీతరసికే - జయ నీలాశుక ప్రియే

మతంగ మునికన్యకాం మధురభాషిణీం ఆశ్రయే

మాణిక్యవీణాం ఉపలాలయంతీం
మదాలసాం మంజుల వాగ్విలాసాం
మహేంద్రనీలద్యుతి కోమలాంగీం
మాతంగకన్యాం మనసాస్మరామి

# మోదకొండమ్మ తుమ్మెదపదం :

మీలాటికాలమురాగ మిమ్ముతలచి పాడతాము

వర్ణధర్మాల ఉక్కుచట్రంసడలి, పాలకుల ఐశ్వర్యం – ఆశ్రితుల నైపుణ్యం, బగతల నాయకత్వం, కొండదొరల కష్టజీవితం, వాల్మీకుల లోకజ్ఞత, కమ్మరులపనితనం, కోదు, పొరజా, గదబలాదిగాగల ఆదిమతెగల అమాయకత్వం ఐక్యమంది ఈ అంతరాలు చెరిగిపోయి, ఎల్లలోకము ఒక్కయిల్లు కావలెనని, నిలచిన నింగిదేవతను – తొక్కిన భూదేవతను, ఆనీడలు తోడులివ్వమంటూ పొలాలు ఊడ్చే పడతులు మాలగంగు, సంజీవరాజులపెండ్లిపదాలలో కోరుకుంటున్నారు. సంక్షిప్తంగా ఇచ్చిన ఈ పాటను(తుమ్మెదపదం) గిరిజనమహిళలు రోజుల తరబడి పాడతారు.

వడ్డాదిమాడుగుల సంస్థానంలోని దోరశిలో మాలగంగు; జయపురం సంస్థానంలోని నందపురం మాకలిశక్తి, దేశిరాజులు; గొలుగొండ(వజ్రగడం) సంస్థానంలోని కొండపేరిట సంజీవరాజు, మోదమ్మ ముప్వలమ్మలాదిగాగల దుర్గాండ్లను దేశిరాజులు గాంధర్వవివాహ మాడిన కళ్యాణపులోవ; పరస్పరం దాడిచేసుకునే రాజ్యాల, ఒకరినొకరు చిన్నచూపుచూసే జాతుల సమైక్యతకు మోదమ్మ కధను ఆధారంగా చేసుకున్న దార్శనికులు గిరిజనులు.

**మోదమ్మపదం చారిత్రకనేపథ్యం**

**రాజులమధ్య వియ్యాలు – కయ్యాలు:**

విశాఖమన్యం సరిహద్దునగల కోరాపుట్ జిల్లాలోని నందపురం కళింగదేశంలో ప్రాచీన రాజ్యం. చంద్రగుప్త విక్రమాదిత్యుని కూతురు ప్రభావతిదేవి ఈ రాజ్యం పాలించే వాకాటకవంశ రాజుల కోడలుగావచ్చి రాణిగా ప్రసిద్ధిపొందింది. నందపూర్‌లో 32వ మెట్లుగల విక్రమాదిత్యుని సింహాసనం ఉన్నది. నందపూర్‌లో ప్రవహించే నది పేరు శీలేరు. నందపురాన్ని తరువాత పరిపాలించిన రాజులలో శిలవంశం, తమవంశానికి ఆ నదిపేరునే పెట్టుకొన్నారు. ఈ శిలవంశరాజులు నందపురం పరిపాలించిన రోజులలోనే, విశాఖమన్యం దిగువన వడ్డాది రాజధానిగా మత్స్యవంశరాజులు, వజ్రగడ(తరువాత గొలుగొండ) రాజధానిగా యాదవరాజులు పరిపాలించారు. మత్స్యవంశపు ఆడపడుచు సింగమ్మను శిలవంశపు విశ్వనాధరాజుకిచ్చి పెళ్ళి చేశారు.

మత్స్యరాజులు 11వ శతాబ్దంలో వజ్రగడను నాశనం చేశారు. వజ్రగడరాజ్యం (గొలు గొండ)లో ఎత్తైనది 'సంజీవికొండ'. కృష్ణదేవరాయలు వడ్డాదిని మాడుగులను జయించాడు.

1830లో వజ్రగడ(గొలుగొండ)ను బ్రిటిష్‌వారు స్వాధీనంచేసుకున్నారు. మాడుగుల జమీందారీ, ముఠాదారీకట్టు 1969లో మనప్రభుత్వం రద్దు చేసేదాకా కొనసాగాయి. ఈ రాజులమధ్య సంబంధాలలో అపశ్రుతులను, ఈ రాజులవెంట మన్యం ప్రవేశించిన పాలకులు, సేవకులు, స్థానికగిరిజనులమధ్య అంటరానితనం, అంతస్థులవల్ల పెరుగుతున్న అంతరాలు–అపోహలు –ఘర్షణలను చిత్రిస్తూ, ఈ జాతులు, రాజ్యాలమధ్య ఐక్యతను కోరుకుంటూ మోదమ్మపదంలో ఒక ఆదర్శవంతమైన మార్పును మనముందు నిలుపుతారు.

మోదమ్మతుమ్మెదపదం గిరిజనసమాజం ఆశయాలను ఆదర్శాలను ఐకమత్యాన్ని కోరుకున్నట్లే (Social engineering), వారంరోజులు చేసే నందిపండుగ గిరిజన ప్రాంతం ఆర్థికవికాసం, వనరులఅభివృద్ధి, వ్యాపారభూస్వామ్య వర్గాలు చేసిన సహకారాన్ని, చేస్తున్న దోపిడీని వాటిని ఎదుర్కొనే మార్గాలను వర్ణిస్తాయి. ఆ పదం వచ్చే నందిపండుగకు అందిస్తాం.

**దుర్గాండ్లు – సప్తమాతృకలు :**

సప్తమాడెములుగా ప్రసిద్ధినొందిన కళింగారణ్యాలు సప్తమాతృకల జన్మస్థానాలు. దుర్గ వింధ్యాచలవాసిని, మలయవాసిని. మాతంగకన్య నందపురం జయపురం సంస్థానపు పూర్వ రాజధాని. అక్కడదేవత మాకలి, ఆమెభర్త భైరవుడు. ఆమెతమ్ముడు వెంకటేశుడు. వెంకటేశుని భార్య దేవేంద్రాలు–దిగువన నర్సీపట్నం. వడ్డాదిమాడుగుల దారిలో రాపల్లెనుపరిపాలించే దేవేంద్రుని చెల్లెలు. వెంకటేశుని చెల్లెలు రాచగన్నియ దేవేంద్రుని భార్య.

**దొంగపెండిండ్లు :**

ఒకనాడు వేంకటేశునికొడుకులు 'దేశిరాజులు' వేటమార్గాన విహరిస్తుండగా, 'వంటల మామిడి' సమీపంలో (మన్యంహద్దు) దేవేంద్రునికూతుళ్ళు ఏడుగురు 'దుర్గాండ్లు' దసులుతారు. ఆ ఏడుగురురాకుమారులు – దుర్గాండ్లు, కళ్యాణపులోవలో దొంగ పెండ్లిండ్లౌతారు. ఈ వార్తవిన్న దేవేంద్రుడు అల్లుండ్లను పిలిపించుకొని దొంగపనులు చేసినందుకు ఏడుగడియలశిక్ష వేస్తాడు. ఆ శిక్ష అవమానంగా భావించిన రాకుమారులు పొడుచుకొని చచ్చిపోతారు.

**పదివేలమాయలు :**

కొంతకాలానికి ఆడపిల్లలు ఎదిగి యజమానులై మారుమనువులకు పోతారని, పుత్రసంతానం లేకపోతే కోటలు, పేటలు రైతురాణువకు దిక్కుండదని సంతానంకోసం దివ్యతిరుపతులు యాత్రలుకదిలాడు వెంకటేశుడు. దేవేంద్రుడుకూడా అనుసరిస్తాడు. కాని దిగువవాడు దేవేంద్రుడు 'పదివేయిమాయలు'గలవాడు. 'కన్నగాడు కత్తి మరవడు – వెజ్జుముండ

చెడిపి మరవదు' అన్నట్లు వానిబుద్ధి ఊరికేఉండదు. నా తమ్ముడు (బావను తమ్ముడంటారు) సత్యం చూస్తానని ఎండలుకాయించాడు. వెంకటేశుడికి దాహం అయింది. మరలతానే అంజనం వేసి 'ఆరువేయుల పూరుబయలు' వెదకిచూసి కర్రియావుపాలుతెచ్చి తానే దాహంతీరుస్తాడు. దివ్యతిరుపతులు వెళ్ళడమంటే మాటలు కాదు. ఇల్లు, వళ్ళు, బాండువ శుద్ధికావాలి. సత్తేడు సంద్రాలలో తానమాడి సుద్దులు, సుబ్బరాలుచేసుకొని పోవాలెనని, తానమాడేబసలో గొడుగులు నిలిపి తానంచేసి కదులుతూ, గొడుగులు మరచిపోతారు. గొడుగులు తేవడానికి వెనుకకువచ్చిన వెంకటేశుడు తిరిగివస్తూ సముద్రంలో అడుగులుజారి మునిగిపోతాడు. దేవేంద్రుడు దుఃఖిస్తూ వెనుకకు మరలుతాడు.

**గౌరవంగపెండ్లి :**

ఆరుగురుదుర్గాండ్లకు పెద్దది మోదమ్మగర్భాన సంజీవరాజు దండెలో డేగ వేసుకొని పుడతాడు. అతడు వేటలకు వెళ్ళినపుడు డేగ ఎగిరిపోతుంది. డేగజాడ వెతుకుతూ పూలగండు వనం గంతవెనుక ఆలపాటలుపాడుతూ – అడవిరొద్దలేరుతున్న మాతంగకన్య, మాలగంగు దగ్గరకువస్తాడు. ఆమె కిడుగనూరిదేశంలోని (దోరశి) మండెబుపర్వతాన మండికొయ్యలకు జన్మించింది. ఆ జాణ తనచూపులకు ఓడిపోయిన సంజీవరాజుచేత కూరకావళ్ళు మోయించి, గొడ్డుమాంసం తినిపించి, చేతనైనంత ఏడిపించిగాని డేగనివ్వదు. మాలకూడు తినివచ్చి మాలబొట్టెను తెస్తానన్న కొడుకును మోదమ్మ ఇల్లుతూరనివ్వదు. ఆరుగురుతల్లులకు, రాజ్యానికి అంతటికీ ఒక్కగానొక్క కొడుకు, ఏం అఘాయిత్యం చేసుకుంటాడో అని తల్లులు మాకలిశక్తికి కబురంపుతారు. మాకలిశక్తి పరుగుపరుగున వచ్చి గంగుగారి అందపుమెరుపులకు, మర్యాదమన్ననలకు ఆశ్చర్యపోయి, సంజీవరాజుకు పెండ్లిచేస్తుంది.



కొత్తపల్లిలో మువ్వలమ్మ

జాలంపల్లిదగ్గర కొత్తపల్లిలో మోదమ్మ చెల్లెలు మువ్వలమ్మ (మావుళ్ళమ్మ) అద్భుతవిగ్రహం మన్యమంతా శక్తిపీఠాలకు ఆలవాలం అని స్పష్టంచేస్తుంది.

ఆరుగురుదుర్గాండ్లలో మోదమ్మఒక్కతే మన్యాన ఉండిపోయింది. మిగిలిన దుర్గాండ్లు పల్లానపదివేయులు పంచుకొనిపోయినారు. గంగుసంజీవరాజులు మినుములూరున ప్రవేశించారు. గంగుగారు తానమాడినగుండం, పూలగండువనం, మాలగంగుమెట్ట

దివ్యస్థలాలు. మోదమ్మ పండుగ ప్రతి సంవత్సరం వైభవంగా చేస్తారు. అరువుతెచ్చుకున్న ఆటగాళ్ళతో పోటీలు, రికార్డింగ్ డాన్సులు, బాండు మేళాలుతప్ప అప్పుడు ఈపాట మాటెవరికీ తోచదు. పాతపాడేరులో రోడ్డుప్రక్కన పడివున్న గంగుగారి పాదాలు మనసును కలవరపరుస్తాయి. చరిత్రను ఆదర్శాలను విస్మరించే జాతి వృద్ధిలోకిరాదు. ❉

## కొండరాజుల - దిగువరాజుల చుట్టరికాలు



## మోదమ్మ పదం :

## మీలాటి కాలమురాగ – మిమ్ముతలచి పాడుతాము :

శరణుశరణు దుర్గాండ్లమ్మలు - మీ చరణాలు తప్పలేను

మీచరణాలుతప్పినగాని - తుమ్మెదీరో - మీ కరుణాలు తప్పలేను

మీలాంటి కాలమురాగ - తుమ్మెదీరో - మిమ్ము తలచి పాడుతాము

ఇంటి ఇలవేలుపులార - తుమ్మెదీరో - మాయందున సాయముండుడు

శరణుబాబు దేశిరాజులు - తుమ్మెదీరో - శరణుబాబు సంజీవరాజు

శరణుగాద గంగుగార - తుమ్మెదీరో - శరణుబాబు సంజీవరాజు

ఓ... మరచిన నుడుగులు బాబు - మతియందు గొలుపవాలె

తెలియని నుడుగులుబాబు - మాకుతెలియచెప్పవాలె

తప్పపాడెము తగులపాడెము - తుమ్మెదీరో - కోపచింతలొద్దుబాబు

మామీద దయలుంచుడు - తుమ్మెదీరో - మామీద సాయముంచుడు

నల్లపూస కొడివల్లన - తుమ్మెదీరో - నారు నాకు నడియవాలె

పచ్చపూస కొడివలన - తుమ్మెదీరో - పదము నాకు నడియవాలె

ఎర్రపూస కొడివలన - తుమ్మెదీరో - ఎలుగు నాకు నడియవాలె

శరణుబాబు మాకలిశక్తి - తుమ్మెదీరో - నందపురమున వెలిసియున్నది

శరణుబాబు దేబాలమ్మలు - తుమ్మెదీరో - మీ చరణాలు తప్పలేము

ఓ... చదువు సాములు లేనివారము - తుమ్మెదీరో - ఇటింపండుగ చేసుతాము

మసిరుసి బట్టలతోను - తుమ్మెదీరో - మిమ్ముతలచి పాడుతాము

ఎనలవారు జతలవారు - తుమ్మెదీరో - మీకు దండము తల్లూలార తుమ్మెదీరో ❊

**దేశిరాజులు - దుర్గాండ్లు :**

మాకలిశక్తికి వెంకటేశుడు తమ్ముడు, భైరవుడు భర్త. వెంకటేశుని పెండ్లాం దేవేంద్రరాలు (దేవేంద్రుని చెల్లెలు). దేవేంద్రుడు రాపల్లెకు (కొండదిగువ వడ్డాది మాడుగుల, నర్సీపట్నం నడుమ గ్రామం) రాజు. భైరవునిచెల్లెలు రాచగన్నిక దేవేంద్రుని భార్య. వీరు బావమరదులు.



నందపురంరాణి మాకలిశక్తి ఆమె భర్త భైరవుడు



మాకలిశక్తి తమ్ముడు వెంకటేశుడు, వెంకటేశుభార్య దేవేంద్రాలు
(దిగువరాజు దేవేంద్రుని చెల్లెలు)



రాపల్లెరామ కచ్చేరిరాజు దేవేంద్రుడు, భార్య, వెంకటేశు చెల్లెలు రాచగన్నియ



వేంకటేశుని సంతానం ఆరుగురు దేశిరాజులు ముస్తాబులై కొండమీద షికారు చేస్తా ఉంటే

దేవేంద్రుని కూతుర్లు దుర్గాండ్లు

రేపల్లె డేర్జాలకు తుమ్మెదీరో - విధములేని ఆటలమ్మ

ఆడతానె ఉన్నారమ్మ తుమ్మెదీరో

ముత్యాలది రోకండ్లేమొ తుమ్మెదీరో గవ్వలది చేటలమ్మ

వచ్చి వచ్చి రాజులేమొ తుమ్మెదీరో - మోదమ్మ రోకలేమొ తుమ్మెదీరో

అలవిగాగ పట్టినారు తుమ్మెదీరో - లెగదెబాబు రోకలెమొ తుమ్మెదీరో



**దుర్గాండ్లు :**

ఓ...చెల్లెల ఓ సైదోడ ఓ వెన్నుదోడ

మారోకలి లెగదుబాబు తుమ్మెదీరో - మరేలాగ చూడుమన్నారు

అలివిగాని దుర్గాలమ్మలు తుమ్మెదీరో - ముఖములు చూసినారు

తలఎత్తి చూడగేమొ తుమ్మెదీరో - వారేబాబు దేశిరాజులు

ఓ...అప్ప ఓ మోదమ్మ తుమ్మెదీరో - ఏదేశపు రాజులుబాబు

ఏదేశపు గులాపువారు తుమ్మెదీరో - మారోకండ్లు పట్టినారు

అలవిగాని మోదమ్మ తుమ్మెదీరో - కోపములు పడుత ఉన్నది

మీకండ్లు పేలిపోను తుమ్మెదీరో - మీ గుడ్లు చిదికిపోను

ఏ దేశపు దేవతూలుతుమ్మెదీరో - ఏ దేశపు రాజులమ్మ

అలవిగాని మోదమ్మ ఓ... తుమ్మెదీరో - కాని కంగాలి మాటలమ్మ

**దేశిరాజులు :**

పాపగాద పాపగార తుమ్మెదీరో - ఆలించు అర్ధములు

మాలలము మేముకాము తుమ్మెదీరో - దాసులము మేముకాము

మీకోసమే వచ్చితిమి తుమ్మెదీరో -

మాయమ్మగ మాకలిశక్తి మీకు మేనగఅత్త అవుతది

మాబాబు బయిరూడు తుమ్మెదీరో - మీకు మేనగమామ అవుతడు

మీ బాబు దేవేంద్రుడు తుమ్మెదీరో - మాకు మేనగమామ అవుతడు

మీ అమ్మ రాచగన్నియ తుమ్మెదీరో - మాకు మేనగఅత్త అవుతది

మేనమరదండ్లు మీరు మాకు తుమ్మెదీరో - మీకోసమే వచ్చినాము

ఆలకించిరి మువ్వలమ్మలు తుమ్మెదీరో - ఆలోచించిరి కన్నతల్లులు

అందరికి పెద్దదుర్గ తుమ్మెదీరో - అలవిగాని మోదమ్మవో

**దుర్గాండ్లు :**

మనకు తండ్రిలేడుబాబు తుమ్మెదీరో - పదమ (ప్రధమ) తండ్రిగ ఉన్నడు మనకు

కారకుడు కన్నతండ్రి తుమ్మెదీరో - కాచితె కాచుతాడు

కాయకుంటె ఖండించుతాడు తుమ్మెదీరో -

వేగురాన దిగుడుబాబు చెల్లెలా సైదోడ

చేటలు జల్లినారు తుమ్మెదీరో - కొలువులోన నిలిచినారు

ఆరుగురు దేశిరాజులు తుమ్మెదీరో - వెంటనైన వెళ్ళిపోయిరి

**కొత్తపల్లి మువ్వలమ్మ :**

అందరికి చిన్నదమ్మ తుమ్మెదీరో - ఆదెబాబు మువ్వలమ్మ కొలువైన దిగదుబాబు

ఓ...భయములు పడుతున్నది సిగ్గులు పడుతున్నది

చేయులుపట్టి లాగుతూనే ఉన్నదిబాబు కదలదయ్య కన్నతల్లి

అలవిగాని కొత్తయ్య ఓ తుమ్మెదీరో - అందరికి చిన్నవాడు

వానిమీద మువ్వలమ్మకు తుమ్మెదీరో - మనసు నిలిచియున్నది

మరదలిల్లు మాలయిల్లు తుమ్మెదీరో - నీశక్తి మాతరము లేదన్నారు

అలవిగాని కొత్తయ్య ఓ తుమ్మెదీరో - చేరరాగా

ముఖములోన నిలచిరిబాబు తుమ్మెదీరో - ముసుగునవ్వు నవ్వుకోని

కొలువులోన నిలిచిరిబాబు తుమ్మెదీరో

అలవిగాని కొత్తయ్యకు పెళ్ళులైన చేసుకొని

ఓ... అత్తగారు బావగారు ఇంటికైన వారు పోయి కొత్తపల్లి పోయినారు

కొత్తపల్లి మువ్వలమ్మ తుమెదీరో - నీకు దండాము కన్నతల్లి



**దొంగ పెండ్లిండ్లు :**

ఓ... ఆరుగురు దేశిరాజులు ఆరుగురు దుర్గాలమ్మలు –
వారైన కూడుకొని రతలైన ఎక్కినారు
ఆకాశ మండలాన పెద్దగెద్దులలాగబాబు
రతాలైన వెడత ఉన్నయి పులులు దూరనట్టి పుల్లలైన సిడగలుబాబు
కాకులు దూరనట్టి కారండపడవిలోన రతలైన యాపినారు
శరణు శరణు దుర్గాలమ్మలు ఉపజాప మంత్రములు వారేలాగ మంతరించిరి
కారండపు అడవిలోన వారేలాగ జల్లినారు.



కోటలు, పేటలు, మిద్దెలు, గాలిపురి మేడలు కలిగిపోయింది. రైతురాణువంత పిలిపించు కొని దొంగపెండ్లిండ్లౌతున్నారు.



అగదులు ఎగురుతున్నవి, దగదులు మోగుతున్నవి, అక్కడ అగదులు ఎగురుతుంటె రాపల్లె రామకచ్చేరిలో కొలువులై దేవేంద్రుడు ఆలకించినారు. ధరణి ఒక తొనుకు తొనికిపోతున్నదట. దుర్గాండ్లకు, దేశిరాజులకు దొంగ పెండ్లిండ్లుగద. శీతగాలి కమ్మినట్లు సీమ చినుకు తగిలినట్లున్నది, ఆ గదులు రణబేర్లు. పుడితిని బుద్దెరిగితిమి గాని ఎన్నడింత ఆగదులెరుగము. రాజ్యమున రాజుపుట్టిడ, దేశమున దేవుడుపుట్టిడ, రాజ్యమంత చిట్టచీకటి కమ్మిపోతున్నది. నా కూతుర్లు, మా అల్లుండ్లు దేశిరాజులు ఉండవచ్చు!



వేగురానవెళ్ళి పిల్లలున్న మేడలకు వెళ్ళిచూస్తే లేదు. “నాకెరుకలేకుండ దొంగ పనులుచేసి దొంగపెండ్లిండ్లు అవుతున్నారు. ఈడుజోడుగల్ల రాజులకు, గౌరవంగ పెండ్లి చేద్దాం అంటే దొంగపనులు చేసినారు. మాయప్ప మాకలిశక్తికేం బుద్ధిలేద, మా బావ బాయిరూడుకు జ్ఞానంలేద. ఎదురుగవస్తే ఇయ్యకపోదున, గౌరవంగ పెండ్లిచేయక పోదున. తగనిపని చేసినందుకు కోపం” అని వేగురాన జాబురాసి బారికవానికిచ్చి పంపినాడు. ఆ జాబు

అందుకొని అందరికి పెద్దది మోదమ్మకిచ్చారు. 'కారకుడు కన్నతండ్రి – కాస్తే కాస్తాడు కాయకపోతే ఖండించుతాడు' అని అందరు కల్లేనపులోవ (కళ్యాణపులోవ) వెనకబెట్టి రాపల్లి దేర్జాలకు పయనమైనారు.

**ఏడుగడియల శిక్ష – ఆత్మహత్యలు :**

మామగాద మేనమామ - మామగాద కన్నమామ
వలపల దిరిగి వందనము - దాపల దిరిగి దండము

మీరు తప్పుపనులు చేసినందుకు కోపంపడితిని. మీకున్న భయములేదు, మీకున్న కొదువలేదు. అరనిముసము శిక్షలు వేస్తాను అని చుట్టూర కోటల తలుపుడెక్కి అందరిని ఒక్కకాడ కూడేసినాడు.



అందరికి పెద్దరాజు ఈ శిక్షలో మనం చచ్చిపోయిన మంచిదిగాని మనము బతికిన ఫలములేదు అని అందరు పొడుచుకొనిచచ్చి గుండమైపోతారు. రాజ్యమంత చిమ్మచీకటి కమ్మిపోయింది. దేవేంద్రుడు ఏమికారణాలు అని రాజమంతా చాటింపు చాటిస్తూ ఉన్నాడు.

పంజరంలో ఉన్న రామచిలుకలు, హంసలు, బాతులు, గోరలు, మైనలు అమ్మ! రాచగన్నియ మాదొక్క మనవి తల్లి; ఏమంతె ఏమను కోకు, మీ ఆరుగురు అల్లుండ్లకు మీ బావ దేవేంద్రుడు కల్లేనపు లోగిలిన దొంగపెండ్లిండ్లు అవుతుంటె మీ బావ పిలనంపి సంకెళ్ళు వేస్తే పొడుచుకొనిచచ్చి గుండమైపోనారు. అప్పుడు రాచగన్నియ తలుపుడెక్కి చూస్తే అయ్యో తల్లిముండ ఉండగనే కూతురుకూడా ముండవా అని రాచగన్నియ పక్కనున్న ఆ బాకుతీసి పొడుచుకొని తానుగూడ గుండమై పోయింది.



**తీర్థయాత్రలు – వెంకటేశుని దుర్మరణం :**

వేంకటేశుడు ఆరుగురు దుర్గాండ్లకు మేడలుకట్టి తీర్థయాత్రలు వెడుతుంటే దేవేంద్రుడు...

తమ్ముడ ఓ సైదోడ - తమ్ముడ ఓ వెన్నుదోడ
నీవైన యాలకించు - అడుగులైన నిలిచి నీవు
ముందుకు వెళ్ళిన అడుగులమ్మ - వెనుకలైన తగ్గినాడు
శరణుశరణు వెంకటేశు - యింటికైన నిలచెనోయి

మన ఆడపిల్లలు ఎదిగి యజమానులై మారుమనువుకు వెళ్ళిపోతే మనకెవరు దిక్కు లేదుగద. మనం యాత్రలువెళ్ళి పుత్రసంతానంకలిగితే మగపిల్లలుకలిగితే మన కోటలు పేటలు రైతురాణువకంత మనదే పేరు. అలాగని దివ్యతిరుపతులు యాత్రలు వెడుతున్నారు. నేను కూడా వస్తానని దేవేంద్రుడు పయనాలు గట్టినాడు.



నా తమ్ముడు సత్యముచూస్తాను. నేనొక అగదుచేస్తాను. ఈ అగదుకు ఆగుతాడ లేద! దేవేంద్రుడువెనుక, వెంకటేశుడుముందు. మూడు నేత్రాలు గల్లవాడు దేవేంద్రుడు. రెండునేత్రాలు గల్లవాడు వెంకటేశుడు. వేయుమాయలవాడు వెంకటేశుడు. పదివేయిమాయలుగలవాడు దేవేంద్రుడు. దేవేంద్రుడు పెట్టిన అగదుకు భూమి, ఆకాశాలు బద్దలయ్యే ఎండకాస్తుంది. వెంకటేశుడికి దాహంపుట్టింది. ఆరు వేయుల పూరుబయలు. తలమీద చేయి వేసి ప్రార్ధించి చూస్తున్నాడు. బయలు మీద వేంకటేశుడు చూడచూడగ గొల్లవాడు పసులుకట్టి యున్నాడు. ఆ పశువులలో కర్రియావుపాలు అరగుంచాన కుంచెడు తీసుకొని దాహం తీర్చుకొన్నారు.



దివ్యతిరుపతులు వెళ్ళడమంటె – శుద్దులు తానాలుచేసి ఉండవాలె. సత్తేడు సంద్రాలు తానంచేస్తేనే పెదతిరుపతి వెళ్ళడం అని ఆబసలో గొడుగులిడేసి తానమాడి కదలిపోయినారు.

గట్టులోన యీడితిమి మనగొడుగులు – తెమ్మనిపంపిడి దేవేంద్రుడు. వెంకటేశుడు గొడుగులేరుకునివస్తూ సంద్రాన అడుగులు జారి, అలాగే ఉండిపోతే, తమ్ముడా అంటే తమ్ముడులేదు ఏంలేదు, యాత్రలేదు ఏమిలేదు తిరిగి వచ్చినాడు.



**సంజీవరాజు పుట్టుక :**

వారు నాలాగుండగా దుర్గాండ్లు మగళ్ళుపోయినందుకు ఏడ్చిఏడ్చి కళ్ళనార్చుకొని దుఃఖాలు మరుచుకొని ఉంటారు. మోదమ్మకు పాపకష్టాలు, పాపనొప్పులు కలుగుతవి. మంత్రసాని కాలుచేతులు పట్టి మట్టివరుగుచేస్తే.



సరవాల సంజీవిడేగ, వెండి కుచ్చుల వేనపుడేగ, పమిడి కుచ్చుల బంగారు దారాలడేగ దండెలోన వేసుకొని సంజీవ రాయుడు జన్మిస్తాడు.

డేగనుచూసి కోపంపడి మొగముచూసి మోదమ్మ చెపుతుంది. 'వీడు మాలకూడు తింటాడు, మాలబొట్టెకు తెస్తాడు, మనవాడుకాడు' అని మొహంతిప్పుకుంటుంది. 'లేకలేక ఆరుగురు తల్లుల సందు దొరికినాడు. మనకోటలు పేటలు రైతు రాణువకొక్కడే దిక్కు' అని పినతల్లులు పేమతో పెంచుతూండగ ఉంగరాల బొంగరాలబాల యీడుకొస్తాడు. ఈడుకొస్తే మేళాలు కట్టిస్తున్నాడు. వీటిమేళం విజ్జోటిమేళం, సానిమేళం, సంగీతమేళం. మండేబుపర్వతాన మండికొయ్యలకు జలిమించిన గంగుగారు అప్పఇద్దరు మేళాల చూపుకు కదులుతున్నారు.

**మేళాలకు కదిలే గంగుగారు :**

అలవిగాని గంగుగారు, - ఉట్లపై చమురులేమొ - మట్లందు దించినాది
ఓ...మెరుగకని చేసిరిబాబు - మినపపిండి మరదనాలు
చాయకని చేసిరిబాబు - చోడిపిండి మరదనాలు
ఉట్లపై నూనెలేమొ - మట్లందు దించినాది
చేరేడు నూనెలు - చేతియందు తీసినారు
మానెడు నూనెలు తీసి - మానాపతివారి చెలులు - మాడందు పెట్టినారు.
వన్నెలది దువనిబన్నె - వెల్లచిక్కులు తీసినారు
బంగారపు దువనిబన్నె - బాగుగ దూసినారు
వన్నెలది దువనిబన్నె - పాయలైన తీసినారు
జడకు తగునని - జడకుచ్చులు వేసినారు
అరపడి సొమ్ములు - అద్దపుచీరెలు తుమ్మెదీరో - అందమైన గంగుగారో
అప్పగాద పెద్దయప్ప తుమ్మెదీరో
ఆటలకి సాటింపులు తుమ్మెదీరో మన బావ సంజీవరాజు

తొలకరి మెరుపులు మెరసినట్లు తుమ్మెదీరో
తోలెటెండలు గాసినట్లు తుమ్మెదీరో
అద్దపు మెరుగులు నిద్దపునీడలు తుమ్మెదీరో అందమైన గంగుగారు
పాపడిబిళ్ళలు నెలవంకలు - కొప్పలకు కొనగొలుసులు
మట్టెలకు పిల్లెండ్లు - బాజుబందులు పలకసార్లు
ముత్యాలమంజూరులోన తేలినారు గంగుగారు
దారినున్న దబ్బలుదాటి తుమ్మెదీరో నీడనున్న నిమ్మలుదాటి
ఉల్లిదొడ్లు దాటినారు పట్నాలెనుక వేసినారు
ఆరువేయుల పూరుబయలు తుమ్మెదీరో అందినారు గంగుగారు
శరణుబాబు గొప్పరాజులు - వారేలాగు చూసినారు
రంగైన రాచబొట్టెవ - తుమ్మెదీరో - పట్టయిన పడాలు బొట్టెవో తుమ్మెదీరో
మేము మిమ్ము పెండ్లాడతాంగాని మాలబొట్టెలకు దారివ్వం
మేము మాలబొట్టెలంగాదు మన్నెచేడె పడుచులం

గొప్పవారి డేర్జాలు మన మేలాగు దాటిపోవాలి అని పెద్దగంగు వెనుకదీస్తుంటే ఆ పాపం మీదే, మేం దాటిపోతాం అని అప్పరెక్క పట్టిపోయింది గంగుగారు.

పన్నెండు వేల పమిజుబలము మల్లెలపందిరికింద, బంగారు కురుచలమీద కూడినారు సంజీవరాజు. గంగుగారు మెరుసుకొని వస్తాఉంటే రాజమంతా మూర్ఛిల్లిపోయింది. సంజీవరాజుకూడా మూర్ఛిల్లుతాడు. మూర్ఛలుతెలుసుకొని, మాయమ్మ కారకుడు కన్నతల్లి కాచితే కాచుతది, కాయకపోతే ఖండిస్తాది. మీరు వేగురాన వెళ్లుదని కొలువుచాలించినాడు.



**వేటలకు కదిలిన సంజీవరాజు :**

వారు అలాగుండగా... ఊరివారు, ఉగపువారు, పల్లెలవారు, పట్నాలవారు రైతు రాణువంత వేగురాన వేటలకి కదిలినారు. సరవాల సంజీవడేగ, వెండికుచ్చుల వేనపుడేగ దండెలోన వేసుకొని సంజీవరాజు వేటలకు బయలుదేరి.



బందలు తిరిగి బాతులు కొట్టిడి మెట్టలు తిరిగి మేకలు, గుట్టలు తిరిగి గువ్వలు కొట్టి, మోదమ్మ కొడుకు వస్తాఉండగా..

**పూలగండువనంలో గంగుగారి ఆలపాటలు :**

కూరలకు కదిలెనమ్మ - బొడ్డుకూర బొరగకూర - కొమ్మతంటెపు కూరలేమొ
మాసిపుట్టు మండిపుట్టు - సూకురూరు బాకురూరు - బయలుమీద తేలినారు
పాడేరూరిగంతవెనుక తానాలైన చేసినారు -
పూలగండు వనములోన కూరలైన ఏరుతున్నారు
చెల్లెల ఓ చిన్న గంగు - తుమ్మెదీరో - పాటలైన పాడుగద
ఆడ బొట్టెకు ఆలపదము - తుమ్మెదీరో - ఆలపాట పాడో చెల్లె తుమ్మెదీరో
ఆలపాటలు పాడుకొను - తుమ్మెదీరో - అడవి రొడ్డలు ఏరుకొను
మండెమానుమీద చేరి - తుమ్మెదీరో - కూరలైన యేరుతున్నరు
ఆలపూల అడవిలోన పాలపూలు పట్టెమంచం
దూది పరుపులు దుప్పటిరేకులు - దూరమైతిరి కన్నవార
ఓ... పాడవీటి పట్టపుడేగ - పాటకైన నావాడరావో
సరవాల సంజీవిడేగ - సరదకైన నావాడరావో
బాకురూరి బాలడేగ - బంగరాల నావాడరావో
వెళ్ళి వెళ్ళి సంజీవిడేగ గంగుగారి కొప్పలో వాలింది
గద్దవో గిద్దవో నాకొప్పలోవాలిది, తిట్టినపోదు, కొట్టినపోదు



అని పట్టిచూస్తే..

చిట్టిమువ్వల చిన్నమరిది - నీసిరసుకు దండము

బంగారు మువ్వల బాలమరిది - నీపాదాలకు దండము

వేనూరిచ్చిన వెండికుచ్చులడేగ - ఏనూరిచ్చిన బంగారుకుచ్చులడేగ

అని మెచ్చి పంటిగూన దాచిద్దదట.



సంజీవరాజు డేగజాడ వెతుకుతూ ముఖం తేలవేసుకొని

అప్పగాద గంగుగార - తుమ్మెదీరో - డేగలైన తేలలేద

అప్ప అప్ప అంతావు నీవు - నీకు తల్లినౌతాన నేను

అమ్మ అమ్మ అంతావు నీవు - నీకు తల్లినౌతాన నేను

మరదల ఓ కన్నె మరదల - తుమ్మెదీరో - డేగవచ్చిన జాడచెప్ప

ఇటువస్తే అటు రమ్మన్నదట అటువస్తే ఇటురమ్మన్నదట. సంజీవరాజు బంగారు ఎడమ భుజానికి కుడిపాదము, వెండి ఎడమభుజానికి ఎడమపాదము వేసి కూరమాండ్లైన దిగిదిబాబు తుమ్మెదీరో ఆడబొట్టె మూట. పెద్ద ఉపకారము నీవు కాకుంటె ఎవరు మోస్తారు. ❀

## కావళ్ళు మోస్తున్న సంజీవరాజు :

ఓ... అలవిగాని సంజీవరాజు కూరకావళ్ళు ఎత్తుకొన్నడు, ఇటొకమూట అటొకమూట.



ఏలాంటి నడకలమ్మ
నిక్కుతాను నిగుడుతాను - నీలంపు నడకలమ్మ
తొక్కుతాను తోగుతాను - తోరంపు నడకలమ్మ
మాయూరు నేను ఎరుగను తుమ్మెదీరో, ముందుగుంట నడవో బాబు
దారితోడు నడువోబాబు తుమ్మెదీరో, తోవలైన ఎరుగడో బాబు తుమ్మెదీరో
నారాయణ దేవుడని - కులకులాన దుఃఖాలేమో
తల్లితండ్రితలచి బాబు - దండాలు పెట్టినాడు
బావ బావ అంతివ బొట్టె, - వారు చూస్తే గొప్పేసిరాజులు
మనం చూస్తేం మాలబొట్టెలం - బావబావ అనకు సెల్లె
నేరములుగాదటమ్మ - పాపములు గాదటమ్మ
శరణుబాబు సంజీవరాజు తుమ్మెదీరో
పేముటడవులు సెలపుకొని - చిట్టడవులు సెలపుకొని
పూలగండు మేడలకు - తరలుతుండగ
మసిపుట్టు మండిపుట్టు - కావురాయి డుమ్మాపుట్టు
దొరలైన చెండుతున్నరు - ఆరుమేగుల గొడ్డుమాంసం
అప్ప ఓ పెద్దగంగు - దొరలు మాంసం చెండుతున్నారు

ఆ సామాన్లంతా పడేసి ఒక చిన్న బుట్టి, పీటగత్తి ఏరిచ్చి బావకు ఏమని బుద్ధులు చెపుతున్నది–

ఉన్నవారము ముగ్గురము - కూరలు మంచిగ తిందాము బావ
దుమ్ములు తీసి తేను - దుమ్ముపోగులు ఇస్తారు మనకు
పొట్టలైన పిసికితేను - పొట్టపేగులు ఇస్తారు మనకు
అడ్డిపుట్ట గుండెకాయ - ఆరుమేగుల మాంసము బావ - మనకైన చాలునన్నది

వస్తున్న సంజీవరాజును చూసి దొరలు, ఏదేశపురాజో! మనం ఇక్కడ ఉండవద్దు... పారిపోదాం అంతే.

ఎంతమాత్రం పోవద్దు మీకున్న భయము లేదు, మీకున్న కొదువలేదు అని వారికి ధైర్యంచెప్పి, వారిచ్చిన వాటాలు మోసితెచ్చి గంగుగారికిస్తాడు. పొయ్యిమీద పెట్టి పుర్రుపుర్రున ఊదుతున్నది. అగ్గిపగ్గెలు చేసి, అపరాలు గిపరాలు వండి, గవులుకొట్ట కుండ దొంతిమీదదొంతి వన్నాలుపెట్టి, భోజనాలకు పిలిచింది పెద్దగంగు. ముగ్గురికి మూడువాటాలు పెట్టింది.

గంపెడైన నీకుచాలదు పెద్దగంగు - ఒక మూట నీకు చాలదు
ముఖముఖాలు చూసుకొని తుమ్మెదీరో - మనమీలాగె తింతెనప్ప
మనకెంత పున్నెములు తుమ్మెదీరో
సంజీవరాయునికి కొరబోయి - కక్కులైన కట్టదమ్మ
తలమీద చేటయిడి - ఎడమపాదం మోపినాది - చేటబుగ్గి ఉదినాది
బూర్దగుమ్మడి పండులాగ - బుగ్గైన తేలిపోయిడి
చేటెడు బుగ్గిబాబు - చెల్లైన ఊదినాది

తుమ్మివేరు, మంగవేరు వనాంతరాలుకలిపిఇచ్చినాది. సంజీవరాజు తేరుకొని నాడేగ నాకిస్తేను నేనిలాగ వెళ్ళిపోతాను. మాయమ్మ మోదమ్మ కాసితే కాసుతది కాయకుంటె ఖండించుతాది అనగానే

తెలియని వాడు తెలియనిపని చేసెడిగాని
తలవెంటతానంచేసి భోంచేసి వెళ్ళుబాబు అని మనవులుచేసి
ముత్యాల ముంజూరులోన - లక్కవంటి పీటలు బాబు
గిలుకులది చేరుచెంబు - గలుకులైన గంగతోడి
పాదాలు కడిగినారు - పయ్యంటచెంగులతో యొత్తినారు
సుద్దికట్టలు యేరుకొని - ఇల్లు ఎల్లర తుడిచిరట

 పాదాలుకడిగినారు - పయ్యంట చెంగులతో యొత్తినారు

పాపగాద గంగుగారు - అన్నములె వడ్డనాలు
గిలుకులది చెంబులేరి - గలుకునైన గంగముంచి
బావగద సంజీవరాయ - చెయ్యిలే వార్చుమన్నారు
బాబుగాద గొప్పరాజులు - భోజనాలు చెల్లినావో

అప్పుడు గంగుగారు పంటిగూన నడుమ దాచిడ్డ డేగపిట్ట తీసియిచ్చిది. అపుడా డేగను దండెలోన వేసికొని కిడుగనూరిదేశాలు, ఆసివేయుల పట్నాలు వెనకపెట్టి కల్లేనపులోవకి కదిలి పయనమైనాడు. ఆ పర్వతాలు, పంచలు, లొద్దులు, లంకలు, గద్దలు దూరని గిద్దుటడవులు, రాగికోట, రంపకోటలెక్కివస్తున్నాడు సంజీవరాజు.

మోదమ్మ 'మాలవాడు మనవాడుకాడు మాలఎంగిలి తిన్నాడు. ఏడు మన్నె వెలుగులు అవతల గిడుపుమంటున్నది'. చెల్లెండ్లు వేడుకుంటున్నారు. 'దండమమ్మ కన్నతల్లి. ఏదో పెనిమిట్లులేనందుకు వాడే మన పెనిమిటి, వాడే మనకొడుకు. ఆడ పిల్లలు మనకెంతవున్నా ఏంలేదుగద. మాలకూడు తిన్నప్పుడు మనకేటపెడదాం కాని కోపపడవద్దు' అని చెప్పి గునపాలు పండబెట్టి కుడిగూనకుపొడిస్తే కుడిపక్క ఎంగిలి వెళ్లుకొచ్చిది. ఎడమగూనకు పొడుస్తే ఎడమపక్కఎంగిలి వెళ్ళుకొచ్చిది. 'వారవ్వ బండిమాకలి ఎప్పుడైతేవచ్చిదో అపుడు మనం ఏడుమూళ్ళ కచ్చేరిలో, మునిగొప్పున దాచిడి అప్పుడు వాడి అప్పదగ్గర పెడదాం. అది మంచిదంటదో, చెడ్డదంటదో' అని శాంతం చెప్పి కొడుకును పైకి పెట్టేశారు. పైకిపెట్టేస్తే పర్వతాలు దిగడు, ఆకలనడు, అన్నమనడు, గంజి అనడు, కడుగులనడు.

**మాలగంగువద్దకు మాకలిశక్తి :**

కబురందుకొని నందపురం దేశంనుండి ఆతల్లి కదులుతున్నది. నా కొడుకులకు యాత్రలు పంపిస్తే దొంగ పెండ్లిండ్లైనారు. శిక్షలువేస్తే ప్రాణాలుతీసుకొన్నారు. ఇపుడైనా గౌరవంగా పెండ్లిచేయాలని బారికను పిలిపించి –

ఒరోరి కొత్తిలివాడ పంచనున్న కంచురతలు - తుమ్మెదీరో పడవేయు బయటబాబు
మరపోయిన బండులను మరలైన అమరించు
కీలుపోయిన బండులకు కీలులైన వేయు బాబు
సీలపోయిన బండులను సీలలైన వేయుబాబు
నూనెపోయిన బండులకు నూనెలైన రాయుబాబు
నూరొక్క చక్కురానికి నూనెలైన రాసినాడు
ఎర్రడేరా, పచ్చడేరా డేరాలైనా కట్టినాడు. పువ్వులు దోరనాలు కట్టినాడు.

అలవిగాని రైతు రాణువ తుమ్మెదీరో మారెందు వెడుతున్నది
కిడుగనూరి దేశమందున తుమ్మెదీరో అంది వెళ్ళిది కన్నతల్లి
అప్పగాద పెద్దగంగు - మనఅప్ప బండిమాకలి కదిలైన వస్తున్నాది
చెల్లెలా ఓ చిన్నగంగు తుమ్మెదీరో -
అప్పఅప్ప అనకువమ్మ తుమ్మెదీరో - వారు చూస్తే గొప్పవారు
అలాంటి మాటలంతవ నీవు - మనం చూస్తే మాలబొట్టెలం
ముత్యాలాది ముంగిలి - కన్నతల్లి అందివెళ్ళిది



లోగిలి చూడగాను లోకండ్లు వెలిగెనమ్మ
ఎర్రటి నయనాలు ఎత్తయిన చూసితేను
అలవిగాని కన్నతల్లి తుమ్మెదీరో,
నవరత్నాల రాగమెత్తి, కెవ్వుమని కేకవేసి
అమ్మగాద గంగుగార నీకున్న భయములేదు నీకున్న కొదువలేదు
మామనుమ సంజీవరాజుకు - ఈడు జోడు చూచుతాను - ఎనలైన ఎంచుతాను
అప్పగాద పెద్దగంగు - మనయప్ప బండిమాకలి - మన చూపులకు వస్తున్నది
ఎదురైన అయినారు - ముత్యాల ముంగిలిలోన
భయములు పడ్డరమ్మ - మండిగర్లు తేలిపోయిది తుమ్మిదీరో
దాగిపోయిది ఆసివేయుల దురుగాన
మీకున్న భయములేదు మీకున్న కొదువలేదు
మా మనుమ సంజీవరాజుకు - ఎనలైన చూసుతాను
ఆ మాటలు ఆలకించి - తుమ్మెదీరో - అలవిగాని గంగుగారు
అద్దాలు మెరిసినట్లు - గంగుగారి మెరుపులట తుమ్మెదీరో
వేసెగియెండలు వెర్రియెండలు తుమ్మెదీరో

గంగుగారి మెరుపులకి కన్నతల్లి మూర్ఛిల్లి పోయినాది. దాని మూర్ఛయది తీసుకుని యాదైననిలిచినాది.

ఓ...జాతికి తక్కువగాని - జలమరాసు లెక్కువున్నవి
పుట్టుకు తక్కువగాని - పూర్వరాసులెక్కువున్నవి
ఈడుజోడు తగునమ్మ - తుమ్మెదీరో - నా మనుమ సంజీవరాజు
పెండ్లులైన చేసుతాను - తుమ్మెదీరో - ఉండుడోయి బాబుగారు
నేనైన మళ్ళుతాను - తుమ్మెదీరో - బండ్లయిన మళ్ళినాది తుమ్మెదీరో
నందపురపు దేశాలందున - తుమ్మెదీరో - అందివచ్చిది కన్నతల్లి

## పెళ్ళిఏర్పాట్లు :



అలావుండగా అరిసెలప్పలు, గారెలు బూరెలంత తయారుపెట్టుకొని దుర్గాండ్లకు చీరెలు, రెవికలు, నగలు; సంజీవరాజుకు వారి ముస్తాబులు కాశిలూరు (కాశి పురం) సంతకు వెళ్ళి అప్పుడప్పుడు కొని సంపాదించిరి. ఆ దినము అట్టెపోగా అలవిగాని గంగుగారికి రవికెలు, నగలైనచీరలు చేస్తున్నది కాశిలూరి సంతలోన అలవిగాని సంజీవరాజుకు కమలపూలకమీజు ఆదిగాద కొన్నదేమొ.

బంగరపు జలతారులు - అంచుఅంచుకు అద్దాలేమొ
బంగరపు బటుంగరాలు - వేలివేలికి వెండుంగరాలు
మువ్వజవ్వాది గోరెండిగలు - ధనరాశి ఒరుమల్లెలు - ముస్తాబులు కొన్నదమ్మ
నిమ్మకాయంత బంగారాలుతీసి - కమసలివాడిని పిలనంపి
కుదురు చింతన - కుదురు కొలుములువేసి
మదురు చింతన - మరి కొలుములువేసి

ఏడేడురోజులు బంగారాలు చేయించింది. అందరికేమోగాని నా చిన్నకోడలు మువ్వలమ్మ నాతీరున పుట్టిది. దానికి ఎనుమట్టు పుస్తెలనిచేయించి.

కంసాలికి పిలనంపి తుమ్మెదీరో వారివారి కొలువులలోన తుమ్మెదీరో
సిరికొలుములు పెట్టించినాది తుమ్మెదీరో,
ఆ మన్నెనగరిలోన మరికొలుములు పెట్టించినది తుమ్మెదీరో

పట్టయిన బాజుబందులు తుమ్మెదీరో ఎనుమట్టుపుస్తెలమ్మ తుమ్మెదీరో
పుస్తెతాళ్ళు చేయించిది బాపన దగ్గరికి పరుగుపరుగున వెళ్ళినారు తుమ్మెదీరో
వెలుపల దిరిగినారు తుమ్మెదీరో వందనాలు చేసినారు తుమ్మెదీరో
దాపల దిరిగినారు తుమ్మెదీరో దండశరణాలు పెట్టినారు తుమ్మెదీరో

కర్రియావు పేడతెచ్చి - కల్లంపులు చల్లినారు
గరిసెడు గుగ్గిలాలు - తుమ్మెదీరో - పునుగులు వేసినారు

అక్షరాలు తప్పకుండ ఆకుతప్పకుండగ - తుమ్మెదీరో-పంచాంగాలు చూచినారు
శుక్కురారమురోజు చుక్కతగులుతది - శనివారము రోజు మంచిదికాదు
మంగళారపురోజు అమ్మ దోసములు - బుధవారములు డుంబరోజులు
లచ్చివారము మంచిదినము - మూర్తాలు చెప్పినారు

మూర్తాలకబురులుచాటించిది కన్నతల్లి. అట్లుపెట్లు, ఆరెలుబూరెలు ఆదంత వేసుకొని అలవిలేని రైతురాణువ బండిమీద కదులుతున్నది. ఆరుగురు బోయిలమ్మ కన్నతల్లి మాకలిశక్తి. వేగురాన రైతురాణువవారి కంత పిలిపించుకొని కల్లేనపులోవవరకు అగదులమీద బయలుదేరిది.

పల్లాన పదివేయులు - కొండనొక్కవేయు బాబు
అమ్మవారు కదలగానే - తుమ్మెదీరో - డప్పమేళం కదిలినాది
సానిమేళం సంగీత మేళాలు - తుమ్మెదీరో - వీటిమేళం విజ్జోటిమేళం
రణభేరులు మోగుతున్నవి - తుమ్మెదీరో - కంచుతుడుములు కాలిగొమ్ములు
అగదులు ఎగిరెనమ్మ - తుమ్మెదీరో - దగదులు మోగుతున్నవి
అడుగడుగున ఆరదులు - తుమ్మెదీరో - ఎత్తెత్తుకు ఎనుబోతులు
అక్షింతాలుపట్టుకొని - తుమ్మెదీరో - గిలుకులది సిరిచెంబు గలుకుమని గంగతోడి
లక్కవంటి పీటలమ్మ - తుమ్మెదీరో - ఏరెనమ్మ గంగుగారు
ముత్యాల ముంజూరులోన - పీటలైన వేసినారు
బండ్లయిన దిగినారు - తుమ్మెదీరో - పీటలకు కొలువులయి పాదాలైన కడిగినారు

## గంగు – సంజీవరాజుల కల్యాణం :

వేగురానకూడినారు - పదివేల పమిజుబలము - కల్యాణపు లోగిలిమీద
లచ్చుకల్లేనమొ శుభలగ్గెమొ - సీత కల్లేనమొ వైభోగమొ
పెద్దలు పేరంటాలు దిగివచ్చినారు - దేవేంద్ర దేవతలు సభలుదీర్చిరి
అందులో పెద్దలు యెవరెవరుబాబు - సూరుడు చందురుడు పెండ్లిపెద్దలు

సుక్కలాచార్యుడు గడిమూర్తగాడు - అందులో పేరంటాలు వారలెవ్వరు
దేవేంద్రకూతురు దేవగన్నిక - నాగేంద్రకూతురు నాగగన్నిక
వారు ముగ్గురప్పచెల్లెలుపేరటమ్మలు - పేరటమ్మలు వచ్చిరి కల్లేనపులోవ

ఘనులు మునులు ఘనమైన పెద్దలు - అష్టాదిపాలకులు అందివచ్చిరి
పెద్దలువచ్చిరి మిద్దెలున్నారు - గోవులువచ్చిరి గోడలలికిరి
పడుచులువచ్చిరి పంచలలికిరి - చిలుకలువచ్చివి చిత్తరించివి
కాకులు పిలిపించి కావళ్ళుగట్టి - కావళ్లుగట్టించి గంగతెప్పించి
మైనాలచేతను మన్నుకలిపించి - పిచ్చుకలచేతను పీనెపోయించి

 పడుచులువచ్చిరి పంచలలికిరి - గోవులువచ్చిరి గోడలలికిరి

గాలిదేవుడువచ్చి ధూళులు తుడిచి - వానదేవుడువచ్చి కల్లెంపిజల్లి
ఆడి తప్పనివారు అయోధ్యపెద్దలు - హరిచంద్రమారాజు అతికిన పెట్టె
పాలచంద్రవారు పంపినా పెట్టె - సూర్యచంద్రవారు సేకిప్పవాలె
శ్రీరాముడంపిడి చిక్కులపెట్టె

అలవిగాని కాతలవారు - తుమ్మెదీరో - కదులుతూనే ఉన్నరమ్మ
కిడుగనూరి దేశమందు - తుమ్మెదీరో - అంధైన వెళ్ళినారు
చూసినారు గంగుగారు - ఇల్లుజల్లు శుద్ధి చేసి తుమ్మెదీరో
పీనెలు పందిరికింద - దర్శనాలు చేసినారు - అలవిగాని కాతలవారు
తేలెనమ్మ గంగుగారు తుమ్మెదీరో

కొంగువిసిరి నడువబోగ - తుమ్మెదీరో - కొండలే వెలుగులాయె
కాలువేసి నడువబోగ - తుమ్మెదీరో - కాళింగ వెలుగులాయె
మల్లెలాదివారిపందిరి - తుమ్మెదీరో - వారేబాబు పెండులవారు
కస్తూరిగంధాలేమొ - తుమ్మెదీరో - కాటుకలు పెడుతున్నారు

అలవిగాని సంజీవరాయుడు - తుమ్మెదీరో
సూర్యుడు మెచ్చునట్లు - తుమ్మెదీరో - చుక్కబొట్లు పెట్టినారు
నాగేంద్ర పంచలది - తుమ్మెదీరో - నడుమెల్ల గట్టుకొను
వేలివేలికి వెండుంగరాలు - తుమ్మెదీరో - బంగారపు బటుంగరాలు
ధరణి ఆకాశము దండమన్నాడు - సూరుడు చందురుడు నీదె భారము



ధరణి ఆకాశము దండమన్నాడు - సూరుడు చందురుడు నీదె భారము

కాలు తొక్కియేమొ కంకణాలుకట్టు - అర్రువంచియేమొ అందెపుస్తెలు

ఎనుమట్టె పుస్తెలమ్మ తుమ్మెదీరో వాడేలాగు కట్టినాడు

దాని తరువాత పెద్దగంగుకు - పుస్తెలైన అందిది బాబు

దాని తరువాత చిన్నగంగుకు - పుస్తెలైన అందలేవో

ఆఖరువుకు చిన్నగంగుకు - పుస్తెలైన అందలేదో

పూలబంతి చల్లినాది - తుమ్మెదీరో - అలవిగాని చిన్నగుంట

ఇట్టెదానవు నీవుముండ - ఆట్టె దానవు నీవు గాద

ముగ్గురు మొగుళ్ళున్నదానవు - కళ్ళుపోయిన పెద్దగంగు

పదిమంది జనముదగ్గర - పల్లెత్తి నవ్వితీవి

గోలలైన చేసుతున్నది - కాని కంగారి మాటలేమొ - అలివిగాని బాలపాప

ఆ మాటలు ఆలకించు కోపములుపడ్డరమ్మ అలవిగాని కన్నతల్లి

పుస్తెలైన కట్టించిది అలవిగాని కన్నతల్లి

పన్నెండురోజుల పెళ్ళులైన - ఎక్కటివారు బాబు

లెక్కలేకపోయినారు - పెద్దలు పేరంటాండ్లు మరలయినపోయినారు

అందరికి పెద్దదమ్మ అలవిగాని మోదమ్మ

దాని తరువాత పుట్టినాది అలవిగాని పెద్దదుర్గ

పెద్దదుర్గ తరువాతేమొ - అదె బాబు కనకదుర్గ

దానితరువాత పుట్టినాది - అదె బాబు బోశుకొండ

దానితరువాత పుట్టినది - అదె బాబు విజ్జడగ్గు

అందరికి చిన్నదమ్మ - యాదెబాబు మువ్వలమ్మ తుమ్మెదీరో

అత్తతీరు పుట్టినది - కొత్తపల్లి కొలువైనది

ఆరుగురు దుర్గాండ్లేమొ - తుమ్మెదీరో - పల్లాన పదివేయులు తుమ్మెదీరో

పంచుకొని పోయినారో తుమ్మెదీరో

మోదమ్మ పాదాలలో అలవిగాని - కన్నతల్లి అక్కడైన ప్రవేశించు

గంగుగారు సంజీవరాజు మినుములూరు ప్రవేశించు

అమ్మగాద మువ్వలమ్మ - తుమ్మెదీరో - కొత్తపల్లికి ఉన్నదిబాబు

అమ్మగాద కనకదుర్గ - బెజ్జవాడ యున్నదిబాబు

అమ్మగాద మాకలిశక్తి - నందపురము యున్నదిబాబు

నా మనవి చిత్తగించుడు - తుమ్మెదీరో - నా మీద దయలుంచుడు

ఊరు ఊరున దుర్గాలమ్మలు - తుమ్మెదీరో - శరణుతల్లులు మీకు దండము

ఏడుకోటిదేవతలు - తుమ్మెదీరో - మీ చరణాలుతప్పలేను

శరణు బాబు దేబాలాల - తుమ్మెదీరో - మీ చరణాలుతప్పలేము

మీ శరణాలు తప్పినగాని - మీ కరుణాలు తప్పలేము

మీలాంటి కాలమురాగ - తుమ్మెదీరో - మిమ్ముతలచి పాడుతాము. ❊

## మోదకొండమ్మ పదంలో ప్రదేశాలు



## దొంగపెండ్లి – గౌరవంగపెండ్లి :

పెండ్లిలో ఇచ్చిపుచ్చుకోవడాలకు, వావివరుసలు ప్రాతిపదికలు, అంతస్తుది తరువాత కీలకపాత్ర. ఈపాటలో జరిగిన రెండు పెండ్లిండ్లలో మొదటిది నందపురం దేశిరాజులకు దిగువవాడైన దేవేంద్రుని కూతుళ్లు దుర్గాండ్లతో పెండ్లి. కులంతో పట్టింపులేకుండా రాజులుగా వారిమధ్య వియ్యంసాగుతున్నది. కాని ఇరుపక్షాల వివాహ మర్యాదలలో, దృక్పథాలలో భేదమున్నది. మన్యంవారైన దేశిరాజులకు 'లాగడం' (గాంధర్వ వివాహం వంటిది) తప్పుకాదు. దేవేంద్రునికి ఇవి 'దొంగపెండ్లిడ్లు'గా కనిపించడం దిగువ మర్యాదనుబట్టి సహజం. ఈ పెద్దవాళ్ళ మర్యాదలు, పట్టింపులు యువతరానికి పట్టవు, తట్టవు.

## తప్పు – వెలి; సంకెళ్ళు – కారాగారశిక్ష :

ఈ 'దొంగపని' ఒరవడికాకుండా, పాలకుడుగా తనఅల్లుళ్ళను దేవేంద్రుడు లాంఛనంగా శిక్షించాడు. కాని నేరము – శిక్ష వీటినిగూర్చి గిరిజనసమాజం దృక్పథం వేరు. గిరిజనసమాజం ఊరుమ్మడి నిర్ణయాలను స్వచ్ఛందంగా అమలుపరుచుకుంటుంది. డబ్బు, దండము ఈ రెంటి బలంతో నడిచేది రాజరికం. గిరిజనసమాజం ఒక కుటుంబం. మగనాలుతోపోవడం 'తప్పు'. కులాంతరసంపర్కం 'నేరం'. 'తప్పు'కు ప్రాయశ్చిత్తం, జరిమానా, నేరానికి 'వెలి' గిరిజనుల శిక్షాస్మృతి. సంకెళ్ళు, జైలుశిక్షవంటి దండనలు లేని సమాజాలవి. సంకెళ్ళ శిక్షలకు చిన్నబుచ్చుకున్న దేశిరాజులు, తమకు, తమవారికి ఈశిక్ష తలవంపులు తెస్తుందని అభిమానపడి ఆత్మహత్య చేసుకున్నారు.

## ఉంచుకోవడం, వెలివేయడం, పెండ్లిచేయడం :

మాలకూడు తిన్నావని వెలివేసినందుకు సంజీవరాజు చిన్నబుచ్చుకున్నాడు. కాని గతంలోవలె ఎటువంటి విషాదకరమైన పర్యవసానికి దారితీయకమునుపే మాకలిశక్తి వచ్చి పెండ్లి చేయడానికి నిశ్చయిస్తుంది గంగుసంజీవరాజులకు వివాహం 'గౌరవంగ' జరిపించి గంగును దేవేరినిచేసింది. మన్యంలో కులాంతర సంబంధానికి శిక్ష వెలి. కులాంతర సంబంధాన్ని 'ఉంచుకోవడం'గా దిగువవారు అనుమతిస్తారు. ఈ రెండు ఒరవడులను తోసిపుచ్చి గంగు వారింట పట్టపురాణిగా ప్రవేశించటంతో కులాల, వ్యవస్థల, అంతస్తుల, దృక్పథాల సరిహద్దు చెరిగిపోయింది.

ఈపరిష్కారం జాతికివివేకాన్ని, హితాన్ని భారత రామాయాణాలవలె బోధిస్తున్నది. ఈ

వివేకం లక్షలలో ఏ ఒక్కడి ప్రవర్తనలో ఫలించినాచాలు, మరొక మాలగంగుపాటను జాతి పాడుకొంటుంది.

**పల్లాన పదివేలమాయలు :**

ఈ కథలో మరొక వివాదం, వెంకటేశుడు దేవేంద్రులమధ్యది. 'పల్లాన పదివేయులు' పదివేల వింతలు మాత్రమేగాదు పదివేలమాయలు అనికూడా అర్థం. దేవేంద్రుడు మూడు నేత్రాలుగల్లవాడు. తన దృక్పథంపెంచిన గర్వంవల్ల తన అల్లుళ్ళను, తన భార్యను; తన మాయలాడితనంవల్ల తనబావ వెంకటేశుని కోల్పోయినాడు. ఈనాడు మన్యంచేరి నీతిమాలిన వేషాలువేస్తున్నవారి చరిత్రలకిదొక నమూనా. తమ విలువలబట్టి, గిరిజనులను లోకువగా చూడడం, గిరిజనుల దృక్పథాన్నివాడుకొని వారిని వంచించడం అలవాటైపోయింది. అవకాశాలను తమకనువుగా మలచుకొని, దోచుకునే ధోరణి మానుకుని నాగరికులుగా, విద్యావంతులుగా తమ విజ్ఞానాన్ని, వ్యవహారదక్షతను పంచిపెడితే ఎగువవారు, దిగువవారు, ఎల్లప్రజలు సుఖపడతారు.

## కొండవారి-దిగువవారి దృక్పథాలు



# ఆధార గ్రంధాలు

✦ Orissa District Gazeetters. Koraput , 1966. P.41. In Nandapur, there are ruins of the temples of Mahakaleswara, Vaitala Bhairava and of Goddess Durga.

రెడ్డిరాజ్యచరిత్ర (2001) మల్లంపల్లి సోమశేఖరశర్మ. తెలుగువిశ్వవిద్యాలయం. పుట. 160. నందాపుర శీలవంశరాజులు గంగరాజు, భయ్యలేక భైరవరాజుపుత్రుడు (శక 1348) ఒడ్డాది జయంతుని కొడుకు మత్స్య సింగరాజు, గంగరాజుయొక్క మేనమామ విశ్వేశ్వర లేక విశ్వనాధ రాజు మత్స్యజయంత రాజతనయ సింగమాదేవిని వివాహమాడెను. పుట140. అల్లాడరెడ్డి సచివుడులింగన ఒడ్డెరాజును పలాయితునిచేసి, అతని నివేశన స్థలమున పెద్ద తటాకము కట్టించెనని 'శివలీలావిలాసం'.

✦ Vizagapatnam manual 1869. P.320.

The "Madgole family and Estate"

These Zamindars claim descent from the sovereigns of "Matsya Desa" who were closely connected with the Pandava race. They state that they established themselves first at Paderu, a place lying above the ghauts to the north of Madgole. There is a reservoir there, called 'Matsya Gundam', containing great numbers of fish. Before signing their names, the Zamindars of Madgole inscribe the figure of a fish on the paper, and the same is borne on their flags. An other account is that they came into the country with the founder of the Jeypore family, whose cousins they are, and who gave them the Madgole country as a fief; with the title Bhupati, or lord of the earth.

✦ 'యాదవ పురాధీశ్వరునిదిగా పేరుగాంచిన వజ్రగడ, నరసిపట్టణమునకు ఆరుమైళ్ళ దూరమునగల గ్రామము. కోటగోడలపై 12వ శతాబ్దపు శాసనం ఉన్నది. ఈ కోట ఒడ్డెపురాధీశ్వరునిచే (వడ్డాది) నిర్మాలము కావింపబడినది' కళింగ సంచిక.

✦ 'జయపురంరాజులు జంబూదేశమున ప్రాచీన రాజవంశజులు. హిందూస్థానములో వేనుడను రాజు సంతతిలేక చనిపోగా ఋషులు ఆ రాజు తొడఎముకతో తైలమును మధించి మంత్రబలముచే కర్తను సృష్టించిరిగాని వారిసృష్టి జంతు, మనుష్య లక్షణములు కలిగియుండుటచే రాక్షసుడాయెను. అతనిని వారు వింధ్యదక్షిణ ప్రాంతమునకు పంపివేసిరి. అతనికి గైత, మూ, మన్య, కొండ, కోదులని అయిదుగురు కొడుకులు. ఈ అన్నదమ్ముల సంతతి కోయ, చెంచు, సవర, ఎరకల, మద్దు, చాప, కోన, కొండ, బొడియ, పంగు, నాగల, బొత్తడ,

బొంగజాతులు. క్షత్రియులమనుకొనెడు వీరు సులభముగ పౌరోహిత్యమునకు జతపడెడు బ్రాహ్మణపురోహితులు గలిగియుండిరి. కొండరాచ కులస్థులయిన జమీందార్లకు నిషాదుని కుమాళ్లలోనెవడో ఒకడు కూటస్థుడై ఉండవచ్చును.' 'ప్రస్తుత జయపుర రాజకుటుంబంయొక్క ప్రథమపురుషునకు ఇద్దరు జ్ఞాతులు గొడుగు పట్టుచుండిరి. వారిపై దయతలచి ఒకరిని (వజ్రగడం) గొలుగొండలో, ఒకరిని మాడుగులలో జమీందార్లుగా నియమించిరి.'

*(ఆనరబుల్ డి. యల్. కార్మైకిల్ – విశాఖజిల్లా గవర్నమెంట్ ఏజెంట్ వ్రాసిన విశాఖజిల్లా గెజిటీర్, 1935. అనువాదం: విజాపురపు వెంకటరామయ్య, ఆంధ్ర విశ్వవిద్యాలయం గ్రంధాలయంలోని ప్రభుత్వ పురాతత్త్వశాఖలో లభ్యం)*

✦ Vizagapatnam District Gazetteer in the Presidency of Madaras 1907.

P.248. An early Raja of Jeypore had two of his cousins for umbrella bearers and was pleased to promote them to the dignity of feudatories, placing one at Golgonda and the other at Madgole and honouring both with the title of Bhupati or 'lord of the earth.' This Golgonda is a village ten miles west of Narasapatam. The name is supposed to be a corruption of Gollakonda, '*the hill of the Gollas,*' a race of shepherd-kings of whom misty traditions survive in this corner of the district.

P.247. GOLGONDA TALUK. The southern boundary of the taluk runs along a fairly continuous line of the latter, the highest point in which is the striking Sanjivikonda 2,145 feet, so named because it is supposed to produce medicinal herbs good for many ailments.

✦ Orissa District Gazetteers, Koraput, 1966.

P.56. During the time of Pratapa Arjuna Singamma, daughter of Jayanta Raju, was given in marriage to Viswanadha Raju, the Silavamsi prince of Nandapur and thus the Matsya and the Sila families came very close together. Two inscriptions dates Saka 1348 Plavanga Ashadha Su. 11and 15, Friday and Tuesday corresponding to 4th and 8th July 1427 record the gift of Singamma, wife of Viswanadha Raju of the Matsya family of Vaddadi. This indicates that the marriage was performed sometime before 1427 A.D. and probably during the rule of Pratapa Arjuna. Singa Raju, the grandson of Pratapa Arjuna, led contemporaneous with the Silavamsi king Pratapa Ganga Raju, son of Viswanadha Raju and both these rulers are known to have jointly donated the village Kampana in the territory of Killaris (Bobbili).

P.359. Under the Suryavamsi rule 'Saktism' and 'Vaishnavism' began to flourish. The neo-Vaishnavism cult of Shri Chaitanya became very popular in this region and it is held that Lord Chaitanya visited *Matsyatirtha* (Machkund) in the course of his pilgrimage in the South.

✧ India - a regional geography. P.775. NGSI.

The Vakataka queen Prabhavatigupta, the daughter of Chandragupta Vikramaditya II had established her kingdom Capital at Nandapur which is probably the same as Nandapur township in Koraput dist.

### విశాఖజిల్లా గ్రామసాంస్కృతిక పటం



# వ్యవస్థలు

| తెగలు | గ్రామీణులు | నాగరికులు |
|---|---|---|
| దేశిసంప్రదాయాలు | మార్గ, దేశి సంప్రదాయాలు | ప్రపంచీకరణ |
| వస్తుమార్పిడి | సంతలు | నాణేలు - బంగారం |
| అక్షరగంధం లేదు | అక్షరజ్ఞానం లేదు | రాతకోతలు-లావాదేవీలు |
| ఋతువులు | కార్తెలు (పంచాంగం) | కాలెండర్ |
| గణరాజ్యాలు(కులకట్టు) | రాజ్యం | పరిపాలన |
| తప్పు, వెలి | కారాగారశిక్ష | కారాగారశిక్ష |

## వర్ణవివక్ష

**ఆవుమాంసం తినే జాతులు/ తెగలు**
- అపవిత్రులు (అంటరానివారు)
- పాలితులు
- ఊరిపొలిమేర అవతలదేవతలు
- వర్ణసంకరానికి శిక్ష : వెలి

**ఆవుమాంసం వదిలేసిన జాతులు/తెగలు**
- పవిత్రులు
- పాలకులు
- గ్రామదేవతలు
- తప్పు

## విశాఖమన్యంలో రాజ్యాలు

నందపురం
- వడ్డాది (మత్స్యదేశం)
  - మాడుగుల
  - దోరశి
  - ఆరుళ్ళ
  - కోట్ల
- వజ్రగడం (యాదవరాజ్యం)
  - గొలుగొండ
  - గూడెం
  - పసిబయలు
  - గుర్తేడు,దుచ్చెర్తి

# 12వ శతాబ్ది రాజకీయ పటం




\- కోరాపుట్‌జిల్లా గెజిటీర్ 1966

1. కోసల
2. ఖింజిగకొట్ట
3. సువర్ణపుర
4. యయాతినగర
5. తేల్
6. మహానది
7. వారణాసి కటకం
8. చక్రకూట
9. కొలాబ్
10. నందపూర్
11. గోదావరి
12. కళింగనగర
13. కళింగ
14. మత్స్యతీర్థ
15. నందపుర
16. కృష్ణ
17. వేంగి
18. వడ్డాది
19. వజ్రగడ
20. బంగాళాఖాతం

# రంప - గూడెం (1880)




సబాల్టర్న్ స్టడీస్ I - డేవిడ్ ఆర్నాల్డ్ (1982) పుట 92

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ❁ | బం | దే | శి | రా | జు | లు | దు | ర్గాం | డ్లు |
| వెం | డి | కు | చ్చు | ల | వే | న | పు | డే | గ |
| క | మా | ల | గం | గు | ❁ | కా | శి | లూ | రు |
| టే | క | ళ్యా | ణ | పు | లో | వ | రా | జు | ది |
| శు | లి | య్యు | భై | ల | ❁ | జీ | ప | ❁ | వ్య |
| డు | శ | త్త | ర | గం | ❁ | సం | ల్లె | ❁ | తి |
| ❁ | క్తి | కొ | వు | డు | కి | డ | గ | నూ | రు |
| మో | ద | మ్మ | డు | వ | ❁ | ❁ | లా | య | ప |
| దే | వేం | ద్రు | డు | నం | రా | చ | గ | న్ని | తు |
| మం | డె | బు | ప | ర్వ | తం | ❁ | డం | ❁ | లు |

## పై గళ్ళలో ఈ పదాలు కనిపెట్టండి

1. మాకలిశక్తి
2. దేవేంద్రుడు
3. వెంకటేశుడు
4. కళ్యాణపులోవ
5. దివ్యతిరుపతులు
6. మోదమ్మ
7. సంజీవరాజు
8. పూలగండువనం
9. మాలగంగు
10. కిడగనూరు
11. మండెబుపర్వతం
12. రాపల్లె
13. దేశిరాజులు
14. దుర్గాండ్లు
15. వెండికుచ్చులవేనపుడేగ
16. బండిమాకలి
17. కాశిలూరు
18. లాగడం
19. భైరవుడు
20. రాచగన్నియ
21. కొత్తయ్యు



గూడెం పాతవీధిలో పురాతన దేవాలయం, శిధిలాలు



పాతపాడేరులో శివలింగం



లోతుగడ్డ వీరభద్రుడు



గూడెంకొత్తవీధిలో పంచపాండవులు



పాడేరు మోదమ్మ  అమ్మవారు



నందపురం మాకలిశక్తి

(ఠాకురాణి)



కొత్తపల్లి మువ్వలమ్మ



మినుములూరులో మోదకొండమ్మ పాదాలు



పాతపాడేరులో గంగుగారిపాదాలు

'శరణు శరణు దుర్గాలమ్మలు - మీ చరణాలు తప్పలేను' - మోదమ్మపాట